



# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704






కర్నూలు సంపుటి : 03, సంచిక : 317 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/గురువారం - 23 - జులై - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,


### భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి

# ప్రధాని మోదీకి ఆహ్వానం

- సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్
- ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానిని ఆహ్వానం
- ప్రారంభోత్సవానికి వస్తానని చంద్రబాబు బృందానికి చెప్పిన ప్రధాని
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా



**అమరావతి :** సీఎం చంద్రబాబు ఢిల్లీలో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రధాని మోదీ సహా పలువురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానికి సీఎం ఆహ్వానం పలికారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలపై కేంద్రమంత్రులతో చర్చించారు. గోదావరి - కావేరి అనుసంధానంపై రాష్ట్రాలతో చర్చించాలని సీఎం కోరగా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారు.ఆగస్టు 1న జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తానని ప్రధాని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ప్రధాని పరిచయం చేసిన సీఎం ఈయనే స్థానిక ఎంపీ అని చెప్పారు. అప్పలనాయుడు తనకు తెలుసని ఆయన రోజూ సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తారని ప్రధాని చెప్పారు. తాజా రాజకీయ పరిస్థితులపైనా ప్రధాని, సీఎం మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గంగా, కావేరి నదుల అనుసంధానంపైనా మోదీ, చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. సీఎంతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు ప్రదానిని కలిశారు.పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై చర్చ: కేంద్రమంత్రి సీఆర్.పాటిల్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. పోలవరం, జల్‌జీవన్ మిషన్‌పై ఇరువురు చర్చించారు. పోలవరం సందర్శనకు రావాలని సీఎం - మిగతా 2 లో

### ఏపీలో తల్లికి వందనం

# నిధులు విడుదల

- పిల్లలే మన ఆస్తి అన్న నారా లోకేశ్
- రాష్ట్ర వ్యాప్తంగా 42.70 లక్షల మంది తల్లులకు లబ్ధి
- రూ. 10,120.78 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం
- పిల్లల చదువులు కుటుంబానికి తరగని ఆస్తి అన్న లోకేశ్



**అమరావతి :** విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్న దాదాపు - మిగతా 2 లో

## కేంద్రం హామీ ఇస్తే

# తక్షణమే దీక్ష విరమిస్తా



- సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్
- ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలన్న షరతు
- నీట్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలు
- విద్యార్థులపై కేంద్రం ఎలాంటి కేసులు పెట్టవద్దు
- కేంద్రానికి లేఖ రాసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్

**ఢిల్లీ :** నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తన దీక్షను విరమించేందుకు ప్రభుత్వానికి ఒక షరతు విధించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపు చర్యలు తీసుకోబోమని హామీ ఇస్తే, తాను దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని బుధవారం ప్రకటించారు."ఈ ఉద్యమంలో - మిగతా 2 లో

## తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

- ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని దారుణాలకు ఒడిగట్టాడన్న అచ్చెన్నాయుడు
- బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్టు చిత్రీకరించారని మండిపాటు
- తప్పు చేసిన వారిని ప్రభుత్వం చట్టప్రకారం శిక్షిస్తుందని వ్యాఖ్య



**అమరావతి :** వైసీపీ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూ భాగోతాలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... స్పీకర్‌గా ఉన్నప్పుడు నీతులు చెప్పిన తమ్మినేని ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం దారుణమన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరించి సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పరువు తీసిన వారిని ధర్మాన వంటి నేతలు వెళ్లి పరామర్శించడం, జగన్ వారిని సమర్థించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజకీయ కక్షసాధింపులు తమ సంస్కృతి కాదని, తప్పు చేసిన ఎవరినైనా కూటమి ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించి తీరుతుందని స్పష్టం చేశారు.గతంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన జగన్, ఇప్పుడు వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి ఉత్తుత్తి సమావేశాలు నిర్వహిస్తున్నారని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలు తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు - మిగతా 2 లో



### ఇరాన్‌తో యుద్ధం కోసం అమెరికా

## 37.5 బిలియన్ డాలర్ల ఖర్చు

- ఇరాన్‌తో యుద్ధానికి ఇప్పటివరకు 37.5 బిలియన్ డాలర్లు ఖర్చయిందని వెల్లడి
- అదనంగా 67 బిలియన్ డాలర్ల నిధులు కావాలని కోరుతున్న ట్రంప్ ప్రభుత్వం
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న ఈ ఘర్షణలో 18 మంది అమెరికా సైనికుల మృతి

**ఢిల్లీ :** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక చర్యల కోసం అమెరికాకు అక్షరాలా 37.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3.6 లక్షల కోట్లు) - మిగతా 2 లో

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

- లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్న కవిత
- ఆదాయం కుటుంబ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన
- వీరంతా నిరసనబాట పట్టే అవకాశం ఉందని హెచ్చరిక



**హైదరాబాద్ :** స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, - మిగతా 2 లో

### బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు

## రాంచందర్ రావు అరెస్ట్



- కరీంనగర్‌లోని బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ యత్నం
- హైదరాబాద్ లో గాంధీ భవన్ ను ముట్టించేందుకు బీజేపీ శ్రేణుల యత్నం
- రాంచందర్ రావు సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ :** కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కార్యాలయం ఎదుటే బైఠాయించి కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళనను నిరసిస్తూ బీజేపీ గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా కాంగ్రెస్ నేతలు - మిగతా 2 లో

## 24న తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



- విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఎన్‌టీఏను రద్దు చేయాలని పట్టు
- వీవీబీఎస్ఏ బిల్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- ఢిల్లీ పోలీసుల చర్యలపై విచారణకు డిమాండ్

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా జులై 24న తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ఈ బంద్‌లో పాల్గొంటున్నాయి. - మిగతా 2 లో

### యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ

# పోరాటం కొనసాగుతుంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు.నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ - మిగతా 2 లో

శివసూర్య
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక
గురువారం 23 - 07 - 2026

# సంపాదకీయం

## ఇంధన పంటలకు ఇదే తరుణం!

వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు.బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికి మునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమర్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.మన వ్యవసాయ సాగుభూమి 170--180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుపవనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 2024--25లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరోవంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు.ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూపకల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ(వంటగ్యాస్)కి ప్రత్యామ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700--800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్రమలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయటం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు.మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం-- సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం. భారతదేశానికి వంటగ్యాస్ దిగుమతి అవసరం ఉండదు. ప్రస్తుత ధరల ప్రకారం-- సుమారు రూ.1,50,000 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోగలం. భూమి ఉత్పాదకత పెరిగినకొద్దీ, మనం ఇంధన పంటల్ని ఎక్కువ ప్రాంతాలకు విస్తరించవచ్చు. ఆహార భద్రతకు ఢోకా లేకుండానే ఇవన్నీ చేయవచ్చు.అదే విధంగా, భారత్‌లో 21 కోట్ల ఎకరాల అటవీ భూమి ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఇంధన చెట్లను అడవుల్లో పెంచవచ్చు. ఉదాహరణకు, పాప్లర్(కాటన్ వుడ్), విల్లో(కొండ గన్నేరు), యూకలిప్టస్ (నీలగిరి), సరుగుడు, గుమ్మడి టేకు(గహర్), మాంగియం (మక్కం), సుబాబుల్ తదితరాలు. ఒక ఎకరం అటవీ భూమిలో ఏటా ఎకరాకు 5 టన్నుల జీవ పదార్థాన్ని (బయోమాస్) సాధారణంగా ఉత్పత్తి చేయవచ్చు. జీవ పదార్థాన్ని ఇంధనంగా పూర్తిస్థాయిలో మార్చటానికి ఇప్పుడు సాంకేతికతలు(పైరోలిసిస్, ఎంజైమ్‌లు) అందుబాటులో ఉన్నాయి. అటవీ భూమిలో సుమారు 10శాతం గనక ఇంధన వృక్షాల పెంపకానికి కేటాయించగలిగితే బయోఇథనాల్, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం లేదా సుమారు 2.5 కోట్ల టన్నుల దిగుమతి నూనెకు సమానమైన విలువగల రసాయనాల్ని మనం ఉత్పత్తి చేయగలం.మన భూ విస్తీర్ణం, సారవంత నేలలు, ఉష్ణమండల వాతావరణం, ప్రస్తుత సాంకేతికత, విస్తృత స్థాయి వల్ల సగటు వ్యయం తగ్గటం... ఇవన్నీ మనం హైడ్రోకార్బన్ల దిగుమతి మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను విముక్తం చేసే అద్భుతావకాశాన్నిస్తున్నాయి. ఒక కీలక విధాన నిర్ణయం అమలు 'ఇన్ని రకాల లాభాలను సమాజానికి అందించటం' అరుదుగా మాత్రమే జరుగుతుంది. మనం ఈ అవకాశాన్ని తక్షణం అందిపుచ్చుకోవాలి.

## ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి -** 67.47 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోందని వివరిస్తూ, పిల్లల చదువు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి తల్లికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## తమ్మినేని సీతారాంపై సమగ్ర విచారణకు ఆదేశించాం

**మొదటిపేజీ తరువాయి -** తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడారని తెలిపారు. కేంద్ర మంత్రులు కూడా నేరుగా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. ఢిల్లీ స్థాయిలో ఈ చర్చలు ఫలవంతం కావడంతో, ఆ క్రెడిట్ ఎక్కడ చంద్రబాబుకు దక్కుతుందోనన్న భయంతోనే జగన్ సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం రైతుల ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

**మొదటిపేజీ తరువాయి -** డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్



**మొదటిపేజీ తరువాయి -** బండి సంజయ్ ఆఫీస్ వైపు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు రెండు చోట్లా భారీగా మోహరించారు. మరోవైపు గాంధీభవన్ ముట్టడికి యత్నించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుల సందర్భంగా బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ కార్యకర్తలు నిరసనకు దిగారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ఒకే రోజు జరిగిన ఈ పోటాపోటీ ఆందోళనలు, అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వేడిని రాజేశాయి.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం



**మొదటిపేజీ తరువాయి -** పాటిల్‌ను కోరారు. ప్రాజెక్ట్ వర్క్ స్టాప్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేసేలా చూడాలని సీఎం కోరారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించాలని అన్నారు. పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల పురోగతిపై చర్చించారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపైనా ఇరువురి మధ్య చర్చ జరిగింది. పోలవరం-బనకచర్ల వల్లే కావేరి అనుసంధానం ఆలోచన వచ్చిందని కేంద్ర అధికారులు చెప్పారు.బనకచర్ల-కావేరి అనుసంధానంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకోవడం మంచిదని సీఎం అన్నారు. గోదావరి నుంచి శ్రీశైలానికి తెస్తే మహారాష్ట్ర వాటా అడుగుతుందేమోనని అధికారులు అడగ్గా నీటిని అందరూ సమానంగా తీసుకుంటే నష్టం ఏముందని సీఎం అన్నారు. శ్రీశైలం నుంచి గ్రావిటీతోనే కావేరికి నీళ్లు చేరుకుంటాయని స్పష్టం చేశారు. గ్రావిటీతో చేరుకుంటే ఖర్చు కూడా బాగా తగ్గుతుందని పాటిల్ అన్నారు. శ్రీశైలం నుంచి కాకుంటే బనకచర్ల నుంచి అనుసంధానించడంపై చర్చించాలని సీఎం సూచించారు. అయితే శ్రీశైలం కంటే బనకచర్ల నుంచే తమకు సులువని జలశక్తి శాఖ అధికారులు బదులిచ్చారు. పోలవరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్న సీఎం గోదావరి-కావేరి అనుసంధానంలో భారం తగ్గుతుందని చెప్పారు.పోలవరం కాలువను శ్రీకాకుళం వరకు తీసుకెళ్లడాన్ని పరిశీలించాలని సీఎం సీఆర్ పాటిల్‌ను కోరారు. మహానది-వంశధార అనుసంధానంలో శ్రీకాకుళం ఉంటుందని కేంద్ర అధికారులు బదులిచ్చారు. గోదావరి-కావేరి అనుసంధానంపై మిగతా రాష్ట్రాలనూ ఒప్పించాలని సీఎం కోరారు. భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో భేటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్న పాటిల్ 3 వారాల్లోనే సమావేశం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. సముద్రంలోకి నీరు వృథాగా పోవడం కంటే ఉపయోగించుకుంటే మంచిదన్న సీఎం ఈ అంశంపై జలశక్తి శాఖ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రాల ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. చంద్రబాబు చేసిన అన్ని రాష్ట్రాలతో భేటీ ప్రతిపాదనను పాటిల్ అంగీకరించారు. కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ సీఎం విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై పీయూష్ గోయల్‌కు వినతులు అందించారు. మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం భేటీలో రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం కోసం అమెరికా 37.5 బిలియన్ డాలర్ల ఖర్చు



**మొదటిపేజీ తరువాయి -** ఖర్చయిందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు.నిన్న సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపు అయ్యే ఖర్చులను కూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు రక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు.ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ ఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి.

**నష్టం, రాజకీయ ఒత్తిడి**

ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడిన వారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు.అత్యవసర నిధులు వెంటనే మంజూరు చేయకపోతే, సైనిక శిక్షణను తగ్గించాల్సి వస్తుందని, పరికరాల నిర్వహణ దెబ్బతిని దేశ రక్షణ సంసిద్ధతపై ప్రభావం పడుతుందని హెగ్‌సెత్ హెచ్చరించారు. 2027 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన 1.5 ట్రిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్ దేశ భద్రతకు అత్యంత కీలకమని ఆయన వాదించారు.కాంగ్రెస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, నిధుల కేటాయింపు బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కొందరు నిరసనకారులు సభకు అంతరాయం కలిగించి యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని దాడులకు సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మొత్తం మీద ఇరాన్‌తో యుద్ధం అమెరికా ఖజానాపై భారీ భారాన్ని మోపుతుండగా, దీనిని కొనసాగించేందుకు అవసరమైన నిధుల సమీకరణ ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది.

## కేంద్రం హామీ ఇస్తే తక్షణమే దీక్ష విరమిస్తా




పాల్గొన్న యువ నిరసనకారులపై ఎటువంటి శిక్షాత్మక లేదా ప్రతీకార చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావాలని నేను గౌరవపూర్వకంగా కోరుతున్నాను. న్యాయబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా విధానం కోసం గళమెత్తడమే వారు చేసిన ఏకైక 'నేరం" అని కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్‌లకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు.నీట్ అక్రమాలపై జవాబుదారీతనం, విద్యా సంస్కరణలు కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నారు. దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇప్పటికే ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ, ఆయన తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.సీజేపీ నేతృత్వంలో జరుగుతున్న ఈ ఆందోళనల క్రమంలో పోలీసులతో ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. విద్యార్థుల సంక్షేమం, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను ప్రధాన డిమాండ్లుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే ఉద్దేశంతోనే వాంగ్‌చుక్ ఈ ప్రతిపాదన చేశారు.

## 24న తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



**మొదటిపేజీ తరువాయి -**హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు బంద్ వివరాలను వెల్లడించారు. వరుస పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని, విద్యా వ్యవస్థ స్వయంప్రతిపత్తికి భంగం కలిగిస్తోందని ఆరోపిస్తున్న వీవీబీఎస్‌ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసుల దాడిపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.జులై 24న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, మేధావులు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది.

## యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది



**మొదటిపేజీ తరువాయి -** (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

## తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్

**అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్**

**రబీకి సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ఆమోదం**

**సేకరించే ధాన్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు**

**ప్రధాని మోదీకి కృతజ్ఞత తెలిపిన కేంద్రమంత్రులు**



తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

# లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం.

మాచర్లలక్ష్మణ్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ గద్వాల.



గద్వాల్ (శివసూర్య )జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇంటి ముందు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని అన్నారు..జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి.నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.పార్లమెంట్‌లో నీట్ పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించి, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేయాలి.దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. బిజెపి పార్టి కేంద్రంలో అధికారంలోకి రావడానికి 2014సంవత్సరంలో ఎన్నికలో సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు హామి ఇచ్చి నేటి 12సంవత్సరాలు అయింది అంటే 124కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి కానీ నేటికీ ఒక్క కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. కనీసం సిగ్గు ఉండాలే బిజెపి పార్టి కేంద్రం ప్రభుత్వానికి విద్యార్థుల గొంతును అణచివేయడం కాదు,వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ బాధ్యత అని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామని అన్నారు.ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలిపే హక్కును హరించే చర్యలు దేశానికి మంచివి కావు.బిజెపి పార్టి కేంద్ర ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి లేదంటే తెలంగాణలో బిజెపి ఎంపిలును, ఎమ్మెల్యేలును,నాయకులను రోడ్లమీద తిరగనియమనిఅన్నారు.

# పి ఆర్ ఎస్ వై ఫ్ ప్రధమ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కర




ఎమ్మిగనూరు, శివసూర్య, జూలై 22:ప్రగతిశీల రెవల్యూషనరీ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ ( పి ఆర్ ఎస్ వై ఫ్) ప్రధమ రాష్ట్ర మహాసభల లోగోను ఎమ్మిగనూరు జూనియర్ కళాశాల ముందు నేడు ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా పి ఆర్ ఎస్ వై ఫ్ జిల్లా కన్వీనర్ సావడి రఘునాథ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని విద్యార్థి--యువజన సమస్యల పరిష్కారమే మహాసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం విద్యా హక్కు, ఉపాధి హక్కు సాధన దిశగా పి ఆర్ ఎస్ వై ఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్ వై ఫ్ నాయకులు రాజు, మధు, జష్వా, ఆనంద్ రాజు, వీరేష్, నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ చూపాలి.

## - జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు.




కర్నూల్ (స్పోర్ట్స్ న్యూస్)శివసూర్య, జూలై 22: కర్నూలు పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా మైదానంలో బుధవారం రోజున నిర్వహించిన కర్నూల్ జిల్లా స్థాయి యోగాసన పోటీల ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా కర్నూలు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడల్లో రాణించడం వలన విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని నిత్యం క్రీడలు సాధన చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. యోగాసన క్రీడను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారు గుర్తించారని , ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానిత అతిథి కర్నూలు జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వి. శివరాజ్ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ యోగా నిత్య సాధన ద్వారా సత్ఫలితాలు పొందుతారు అని తెలిపారు. కర్నూలు లో జాతీయ స్థాయి యోగాసన పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికల రూపొందిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగబోయే అమరావతి లీగ్ యోగాసన పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దయ్య , ఉపాధ్యక్షులు ఉపేంద్ర తోపాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు గీత, చిట్టి బాయ్, దేవమణి, సునంద, సునీల్, అబ్దుల్ రెహమాన్ క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలలో 170 బాలురు , 125 బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు.

## పేదల తల్లులకు వరం తల్లికి వందనం

### రెండో విడత నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

### రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 లబ్ధి పొందుతున్న విద్యార్థులు




ఎమ్మిగనూరు, శివసూర్య, జూలై 22: భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యాలయంలోబుధవారం న పట్టణ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఉమున్సిపల్ ఫ్లోర్ రీడర్ వాల్మీకి దయాసాగర్ మాట్లాడుతూ తల్లికి వందనం కింద కూటమి ప్రభుత్వం నిధులు జమ చేయడం జరిగింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 విద్యార్థులకు వారి తల్లి గార్ల అకౌంట్లో 10,091 కోట్లు జమ చేయడం జరుగుతుంది అని తెలియజేశారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వీరితోపాటు 19వ వార్డ్ ఇంచార్జ్ శిల్పి భాస్కర్ , పట్టణ ప్రధాన కార్యదర్శి చేనేత శివ పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కోసం కర్నూలులో ఎంపీఈఓల గర్జన

12 ఏళ్ల సేవలకు గుర్తింపు కావాలి

కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

జేఏసీ, ఏపీ ఎన్జీవో సంఘాల సంపూర్ణ మద్దతు

డిమాండ్లతో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం






కర్నూలు, శివసూర్య,జూలై 22 :వ్యవసాయ రంగానికి క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న మల్టీపర్పస్






ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) తమ ఉద్యోగ భద్రత కోసం కర్నూలులో బుధవారం భారీ ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీఈఓలు పెద్ద సంఖ్యలో హాజరై తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గళమెత్తారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగగా, ఎంపీఈఓలు నినాదాలతో నగరాన్ని మార్మోగించారు. ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించి ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, పదోన్నతి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఈఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ సలహాలు అందిస్తూ, ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నప్పటికీ తమకు ఇప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం విచారకరమన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంటల నిర్వహణ, ఎరువుల వినియోగం, ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎంపీఈఓలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామీణ వ్యవసాయ వ్యవస్థకు వెన్నెముకలా పనిచేస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అందుతున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనడంతో పాటు కుటుంబ సభ్యులు కూడా మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తగిన వేతనాలు, పదోన్నతులు, సేవా సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యమానికి జేఏసీ, ఎన్జీవో సంఘాల అండ

ఎంపీఈఓల ఉద్యమానికి ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ ధర్నాలో ఏపీ జేఏసీ చైర్మన్ కామ్రేడ్ వి. జవహర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సి. కాశన్న, ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు కామ్రేడ్ మద్దిలేటి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివారెడ్డి, ఆర్.వి. రమణ, నాగకిషోర్, నగర కార్యవర్గ సభ్యులు జనార్దన్ రెడ్డి, నాగరాజు, శ్రీరాములు, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు, ఉపాధ్యక్షుడు యసనుల్లా, ఏఈఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వి. జవహర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సి. కాశన్న మాట్లాడుతూ ఎంపీఈఓల న్యాయమైన డిమాండ్లకు జేఏసీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమస్యను రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## రూ.5 వేల ఆర్థిక సహాయం -- వినతిపత్రం సమర్పణ

ఎంపీఈఓల రాష్ట్ర సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతుగా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం తరఫున రూ.5 వేల చెక్కును జేఏసీ చైర్మన్ చేతుల మీదుగా ఎంపీఈఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజుకు అందజేశారు. అనంతరం ఎంపీఈఓల సమస్యల పరిష్కారానికి సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కు సమర్పించారు. ఉద్యోగ భద్రత కోసం ఎంపీఈఓలు చేపట్టిన ఈ ఉద్యమం జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఎంపీఈఓలు కోరుతున్నారు.

# కనకవిడిలో తల్లికి వందనం సంబరాలు



నందవరం,శివసూర్య,జూలై 22:కనకవీడు గ్రామం లోని విద్యార్థిని బుధవారం సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద 1113 మంది కి.14469000 రూపాయలు జమ కావడం జరిగింది. ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు అదే విధంగా . విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ . ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి. కి కనకవీడు గ్రామ ప్రజలు కనకవీడు మహిళలు ఎంతో హర్షం వ్యథం చేయడం జరిగింది. స్కూలు విద్యార్థిని విద్యార్థులు సిఎం సార్ ధన్యవాదాలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కనకవీడు టిడిపి అధ్యక్షులు డబ్బా ఈరన్న మాట్లాడుతు సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతి పథకం ను క్రమం తప్పకుండా అమలుచేస్తారని చెప్పడం జరిగింది.అదే విధంగా గత ప్రభుత్వం కుటుంబంలో ఒకరి కె ఇచ్చేది అదీ కూడా కొంత మంది విద్యార్థులకు జమ కావడం జరిగిందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉప అధ్యక్షులు రామలింగప్ప మరియు టీడీపీ కార్య కర్తలు అందరు పాల్గొనడం జరిగింది.

## పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ కోడ్‌తో సేవల నాణ్యతకు కొత్త ఊతం

## ప్రజల అభిప్రాయాలతో మరింత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

https://pgrs.ap.gov.in/Home/QRGrievanceFeedback
https://qrfy.io/r/tiPojqPsFB

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(PGRS)-మీకోసం

PGRS FEEDBACK

పైన తెలిపిన క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని మీ పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇవ్వగలరు తర్వాత సంబంధిత అధికారి వారు మిమ్మల్ని సంప్రదిస్తారు

నంద్యాల,శివసూర్య,జూలై 22:ప్రజల సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ను మరింత ప్రజాకేంద్రీకృతంగా తీర్చిదిద్దే దిశగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఙ= కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ా+=ా నిర్వహించే కార్యాలయాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్దా+=ా ఫీడ్‌బ్యాక్ఙ= కోడ్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, అలాగేా+=ా సేవలు అందించే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి శాఖ అధికారి తమ కార్యాలయాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లోా+=ా ఫీడ్‌బ్యాక్ఙ= కోడ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఈ ఙ= కోడ్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించి, వారి సమస్య పరిష్కారమైన వెంటనే మొబైల్ ఫోన్ ద్వారాఙ= కోడ్‌ను స్కాన్ చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా ప్రతి కార్యాలయంలో ఏర్పాటు చేసినఙ= కోడ్ బోర్డులు ఎల్లప్పుడూ స్పష్టంగా కనిపించేలా, సక్రమంగా నిర్వహించేలా సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజల అభిప్రాయాలను సేకరించడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచడంతో పాటు అధికారుల పనితీరును మరింత సమర్థవంతంగా సమీక్షించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ా+=ా ఫీడ్‌బ్యాక్ఙ= కోడ్ పై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వ సేవల నాణ్యత పెంపునకు సమర్థవంతంగా వినియోగిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రజలకు విజ్ఞప్తి ద్వారా మీ సమస్య పరిష్కారమైన అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసినా+=ా ఫీడ్‌బ్యాక్ఙ= కోడ్ ను స్కాన్ చేసి మీ అభిప్రాయాన్ని నమోదు చేయండిమీ ఫీడ్‌బ్యాక్ ప్రభుత్వ సేవలను మరింత ప్రజా అనుకూలంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు పాత్ర పోషిస్తుంది.జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించే ప్రతి పౌరుడు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.లి?ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ సేవల నాణ్యతను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# జూలై 25న ఆస్పరిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'సంజీవని' కార్యక్రమానికి శ్రీకారం

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

హెలిప్యాడ్, సభా వేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు,శివసూర్య,జూలై 22:రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సంజీవని' కార్యక్రమాన్ని ఈ నెల జూలై 25వ తేదీన కర్నూలు జిల్లా ఆస్పరి మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తో కలిసి ఆస్పరి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఐ), పార్కింగ్ స్థలాలు, తాగునీటి ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందుగా ఆస్పరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తారని, అనంతరం 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం ప్రజావేదికలో పాల్గొని, పార్టీ క్యాడర్ సమావేశానికి



హాజరవుతారని వివరించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల నమోదు విధానం, వైద్య సేవల నిర్వహణ, వైద్యుల కన్సల్టేషన్, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలన నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న "సేఫ్ మదర్‌హుడ్" కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి పరిశీలించనున్నట్లు తెలిపారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు, ప్రసవానంతరం కూడా తల్లి ఆరోగ్యం, భద్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకుంటారని కలెక్టర్ తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లికి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భర్త అందించే సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రసవానంతరం తల్లుల్లో ఏర్పడే పోస్ట్ నాటల్ డిప్రెషన్ సమస్యలపై అవగాహన, తల్లికి అవసరమైన పోషకాహారం, శిశువుకు సకాలంలో టీకాలు (ఇమ్యునైజేషన్), ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అలాగే "షేర్డ్ పేరెంటింగ్" భావనను ప్రోత్సహిస్తూ శిశు సంరక్షణలో తండ్రి పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో "ఆరోగ్య రథం" కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మొబైల్ వైద్య సేవల ద్వారా ప్రజలకు అవసరమైన పలు రకాల వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేపర్ లీకులకు బీజేపీ ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్ విద్యార్థుల భవిష్యత్తుతో మోడీ ప్రభుత్వం చెలగాటం

నీట్ పరీక్షల లీకేజీ, రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్ట్‌పై భగ్గుమన్న నిరసనలు

ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 22 విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని మూడు నెలల కిందట నీట్ పరీక్ష లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో బుధవారం కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,స్థానిక నాయకులు,యువజన సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసనను గట్టిగా చాటారు.ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ ఆందోళన సమాచారం అందుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై నరేష్ తదితర పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుని పక్కకు తొలగించారు. ఆందోళనకారులను నిలువరించి ధర్నాను విరమింపజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మీడియాతో మాట్లాడుతూ దేశంలో గడచిన 12 ఏళ్ల పాలనలో ఏకంగా 12 సార్లు ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, నిరుద్యోగ యువత, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేస్తోందని ధ్వజమెత్తారు. మొన్నటికి మొన్న నీట్ పరీక్ష లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని, మానసిక వేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, పదేళ్లలో కోట్లాది మంది యువతను మోసగించిందని విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తూ వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం,అక్రమ అరెస్టులకు పాల్పడడం మోడీ ప్రభుత్వ అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేని యెడల రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు నూగిల్ల మల్లన్న, బిరుదు రాధాకృష్ణ , వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు, కూర మల్లా రెడ్డి, రామిడి తిరుపతి రెడ్డి, కొమ్ము పోచాలు, సింగిల్ విండో చైర్మన్లు సామ రాజేశ్వర్ రెడ్డి, చిలుక సతీష్, ముత్యాల నరేష్, కళ్లేపల్లి జానీ, మండల పార్టీ అధ్యక్షులు గాజవేన సదయ్య, భూషణవేణ సురేష్ గౌడ్, బూతగడ్డ సంపత్, వేగోలం అబ్బయ్య గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్, సారయ్య గౌడ్, సయ్యద్ మస్రత్, ఆరే సంతోష్, దాన్నాయక దామోదర్ రావు, ఆడేపూ వెంకటేష్ , ఆర్కుట్ సంతోష్, ప్రదీప్, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,యువజన సంఘాల కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## పోయెమ్ చికిత్సతో శాశ్వత పరిష్కారం డాక్టర్ కిషన్ నున్నావత్




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. అ ఆహారం మింగటంలో ఇబ్బంది తిన్న ఆహారం తిరిగి నోటికి రావడం షాప్ లు అసౌకర్యం క్రమంగా బరువు తగ్గడం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని దానికి పేర్ ఓవరాల్ ఎండోస్కోపిక్ మయూటమి ట పోయెమ్ ఊ చికిత్స ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎటువంటి శస్త్ర చికిత్స కోతలు లేకుండానే నయం చేయవచ్చని మలక్పేట యశోద హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్నవత్ అన్నారు బుధవారం పట్టణంలో యాస్ట్రో ఎంట్రాలజీ పై రోగులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆహారం ఇబ్బంది ఎదురైనా బరువు తగ్గటం జాతిపై అసౌకర్యం కలిగిన నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. మలక్పేట యశోద హాస్పిటల్ లో అత్యాధునిక సాంకేతికతతో ఇలాంటి రోగులకు నిర్వహించి రోగుల ప్రాణాలు కాపాడుతున్న అని తెలిపారు. గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులను సంప్రదించి వారి సలహాలు సూచనలు పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చిదుర వాసు కిరణ్ రెడ్డి పాల్గొన్నారు

## రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యం పై జరిగిన దాడి తీవ్రంగా ఖండించిన కారేపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు

జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) జులై 22 : కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్,మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు నీట్ పేపర్ ల లికేజీలకు బాధ్యతవహిస్తూ , కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధన్ రాజీనామా చేయాలనీ , దానికి నిరసనవ్యక్తం చేస్తున్న లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై మరియు విద్యార్థుల పై జరిగిన దాడి ప్రజాస్వామ్యం పై జరిగిన దాడి అని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బానోత్ రామ్మూర్తినాయక్,మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబుఅన్నారు . దాడి కు నిరసనగా కారేపల్లి క్రాస్ రోడ్లో కాంగ్రెస్ నాయకులు నీరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు భీముడునాయక్,విష్ణువర్ధన్ రెడ్డి,ఐలయ్య,ఉమశంకర్, సర్పంచ్ లు మేదరి టోనీ పూసం ఎల్లయ్య , మోతె వీరాస్వామి, వెంకటేశ్వర్లు,రంజిత్, ప్రవీణ్, హనుమంతరావు, నాయకులు దేగల ఉపేందర్,చయదేవి, రాములు, హనీఫ్,యకూబ్,షఫీ,ముజ్జు,నారాయణ ,రాహుల్ ,రవీందర్ , హేమ్లా ,గోపాల్ తాజుద్దీన్ , కిషోర్ , తదితరులు పాల్గొన్నారు

## దాశరథి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫీజ్ ఖాన్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి దాశరథి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి అని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. ఎం.ఏ హాఫీజ్ ఖాన్ అన్నారు .జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ప్రముఖ తెలుగు కవి, గేయకారుడు దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫీజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహాకవి అని అన్నారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు .నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలుచుకుని ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప ప్రజాకవి అని పేర్కొన్నారు .యువత దాశరథి రచనలను చదివి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, కవి యాదగిరి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు

## పోలీస్ కమిషనర్ కార్యక్రమం ఖమ్మం .



**ఖమ్మంపోలీస్ అధికారులకు ప్రతిభ పురస్కారాలుపతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. పతకాలు పొందిన వారిలో వైరా ఏసిపి సారంగపాణి, ట్రాఫిక్ ఎస్సై మౌలానా, ఎస్సై అమీర్ ఖాన్, తో పాటు పోలీస్ సిబ్బంది వున్నారు. ఉత్తమ సేవ పతకం (03) సేవ పతకం (07) ఉత్కృష్ట పతకాలు (03) సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 13 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీ ఆకాంక్షించారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, =అ కామరాజు పాల్గొన్నారు.**

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం .

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి మహిళలు డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా మారడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం టిటిడిసి లో డీఆర్‌డీఏ--సెర్ప్ ఆధ్వర్యంలో, సీఎస్ఆర్ నిధులతో మీరాయి శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న నీలగిరి జిల్లా మహిళా కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రోన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న 50 మంది మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళలకు 10 రోజుల పాటు ఇస్తున్న డ్రోన్ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని కోరారు. ఈ శిక్షణతో వ్యవసాయ రంగంలోనే కాకుండా ,వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు.డ్రోన్ సేవల ద్వారా ప్రతి ఎకరానికి సుమారు రూ.400 చొప్పున సేవా రుసుము లభించే అవకాశం ఉందని, జిల్లా వ్యాప్తంగా ఒకే విధమైన రేటు విధానాన్ని అమలు చేసుకుని రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. తమకు వచ్చే ఆదాయాన్ని అంచనా వేసుకుని అవసరమైన మేరకు మాత్రమే రుణాలు తీసుకోవాలని, మిగిలిన ఆదాయాన్ని పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా బలపడాలని చెప్పారు.మహిళలు ఉద్యోగాల కై ఎదురుచూడకుండా తామే డ్రోన్ యూనిట్ల యజమానులుగా మారాలని, ప్రతి గ్రూపు వద్ద ఒక డ్రోన్ యూనిట్ ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. డ్రోన్ ఆపరేట్ చేయడం మాత్రమే కాకుండా డ్రోన్ మరమ్మతు, నిర్వహణలో కూడా పూర్తి అవగాహన పెంచుకుని మెకానిక్‌లుగా కూడా నైపుణ్యం సంపాదించాలని అన్నారు. దీంతో తమ డ్రోన్లను తామే మరమ్మతు చేసుకోవడం వల్ల నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, ఆదాయం పెరుగుతుందని చెప్పారు.వ్యవసాయ రంగంలో పంటలపై ఎరువులు, పురుగుమందుల పిచికారీతో పాటు ,ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సర్వేలు, మ్యాపింగ్ తదితర రంగాల్లో కూడా డ్రోన్లకు విస్తృతంగా డిమాండ్ ఉందని తెలిపారు. అందువల్ల మహిళలు ఒకే సీజన్‌కే పరిమితం కాకుండా ఏడాది పొడవునా వివిధ రంగాల్లో డ్రోన్ సేవలు అందిస్తూ 360 రోజులు ఉపాధి పొందేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు.డ్రోన్ సేవలను పూర్తిగా కమర్షియల్ దృక్పథంతో నిర్వహిస్తూ ప్రతి అవకాశాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవాలని, రెండు పంటల సీజన్లలో వ్యవసాయ సేవలతో పాటు ,ఇతర రంగాల్లోనూ అవకాశాలను వినియోగించుకుని మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ శిక్షణ మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబనకు నాంది పలుకుతుందని, డ్రోన్ టెక్నాలజీ ద్వారా గ్రామీణ మహిళలు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించుకుని కుటుంబాల అభివృద్ధితో పాటు ,జిల్లా అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. శిక్షణ పొందుతున్న ఆపరేటర్లు విజయలక్ష్మి మాట్లాడుతూ సొంతకాళ్ళపై నిలబడి ఎదగడానికి , అభివృద్ధిలోకి రావడానికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి ,మీరాయి సీఈవో విజయ్,జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సతీష్ , జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ ,ఎ పిడి శ్రవణ్ కుమార్ ,శ్రీలేఖ, శ్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు .

## చందంపేట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధిల్లాలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, బుధవారం దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని చందంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఎస్పీ .. స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు విధానం, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ ఆస్తుల సంరక్షణ, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, ఆయుధాల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ నమోదులు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, పోలీస్ సిబ్బందికి అందజేసిన కిట్ల వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ గారు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, దొంగతనాల అరికట్టడం, రోడ్డు భద్రత చర్యలు, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై చర్చించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరమే స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటూ ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని సూచించారు.విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ గ్రామస్థులతో మరింత సమన్వయంతో పనిచేస్తూ పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పెంపొందించడం ద్వారా నేరాల నియంత్రణకు సమర్థవంతమైన సహకారం అందుతుందని తెలిపారు. రాత్రి గస్తీ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయడం, బీట్ అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షించడం, పెండింగ్ వారెంట్లను వేగవంతంగా అమలు చేయడం, రౌడీ షీటర్లు , అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా కొనసాగించడం, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఎస్‌బీ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, డిండి సీఐ బిసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ ఐసా ఖమ్మం జిల్లా కమిటీ నిరసన ర్యాలీ



ఖమ్మంఏఎస్ఆర్ కళాశాల నుంచి ముస్తఫా నగర్ సెంటర్‌లోని ఏనుగుల బొమ్మ వరకు భారీ నిరసనఖమ్మం: ఢిల్లీలో శాంతియుతంగా "మార్చ్ టు పార్లమెంట్" నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం, భాష్ప వాయు (టియర్ గ్యాస్) ప్రయోగించడం అత్యంత అమానవీయమని ఐసా ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నిరసనగా ఏఎస్ఆర్ కళాశాల నుంచి ముస్తఫా నగర్ సెంటర్‌లోని ఏనుగుల బొమ్మ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ×ఆా జిల్లా కన్వీనర్ జమ్మి అశోక్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలనను కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌లు, భాష్ప వాయు ప్రయోగాలతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తే వారిపై దాడులు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం దెబ్బతిన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధానమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంతో తీవ్ర మానసిక వేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని, పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల గొంతును అణచివేసే ఫాసిస్టు విధానాలను దేశ ప్రజలు సహించరని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఆ×ఆా విద్యార్థి సంఘం నాయకులు శరన్, నరేష్, అనూష, లక్ష్మి, కౌశల్య, నాగరాణి, అనన్య, రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని తీవ్రంగా ఖండించారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తాం.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా.



షాబాద్, జూలై 22 జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అన్నారు.మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లిశ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ...సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లైన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, కుటుంబాలకు భరోసానిచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్(ప్రమాద బీమా)సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులంతా విభేదాలు వీడి ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా మాట్లాడుతూ ...మండల స్థాయి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ల సూచనల మేరకు ఈ నెల 20 నుండి జిల్లా వ్యాప్తంగా విస్తృత0గా పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గ, మండల కమిటీలను ఈ సందర్భంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు నమోదైతే యూనియన్ తీవ్రంగా స్పందించి లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో చేవెళ్ల నియోజకవర్గంలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, రమేష్, ఈసీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిమోని యాదయ్య, షాబాద్ మండల మాజీ అధ్యక్షుడు పోనమోని రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, కరుణాకర్ చారి, మల్లేష్ తదితరులున్నారు. షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎన్నికనూతన అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్. షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్, గౌరవ అధ్యక్షుడిగా నాగని రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కడమంచి నర్సింలు, ఉప్పు శ్రీనివాస్, పోనమోని వెంకటేష్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా బర్క నరేందర్, ముక్కు లక్ష్మణ్, జానంపేట శివరాజ్ గౌడ్, కోశాధికారిగా పూర్ణచందర్ గుప్తా, ఈసీ మెంబర్లుగా చిలకమర్రి అనిల్, రాజేష్, మధు, రాజేందర్, రవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వేసవిలో చెరకు రసం తాగితే డీహైడ్రేషన్, ఎండ దెబ్బ రాకుండా ఆపవచ్చా..?



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు.

## హైడ్రేషన్ జరుగుతుందా..

హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది. కానీ ఒక గ్లాస్ చెరకు రసంలో కేవలం 11-17 మిల్లీగ్రాముల సోడియం మాత్రమే ఉంటుంది. సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.

## అధికంగా చక్కెర..

ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. యంత్రాలు సరిగ్గా శుభ్రం చేస్తారని నమ్మకం ఉండదు. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.

## ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..

అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం. దానికి నిమ్మరసం, కొంచెం ఉప్పు కలిపితే శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు అందుతాయి. శరీరంలో నీటిని నిల్వ ఉంచేలా సహాయపడే పానీయాలపై దృష్టి పెట్టడం అవసరం. చెరకు రసం తాగితే తక్షణంగా చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్ నివారణకు లేదా సరైన హైడ్రేషన్‌కు విశ్వసనీయ పరిష్కారం కాదు. తక్కువ సోడియం, ఎక్కువ చక్కెర, హైజీన్ సమస్యల కారణంగా దీన్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. వేసవిలో సరైన హైడ్రేషన్ కోసం నిమ్మరసం, ఉప్పు కలిపిన నీరు వంటి సులభమైన పానీయాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 60 రోజుల పాటు జంక్ ఫుడ్‌ను మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే..!



జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని చాలా మందికి తెలుసు. అయితే దాన్ని పూర్తిగా 60 రోజుల పాటు మానేస్తే శరీరంలో కనిపించని లోతైన మార్పులు జరుగుతాయి. ప్రాసెస్ చేసిన స్నాక్స్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్‌ను ఆపేసినప్పుడు శరీరం దెబ్బతిన్న వ్యవస్థలను మళ్లీ సరిచేసుకోవడం ప్రారంభిస్తుంది. తాజా పరిశోధనలు తెలిపిన ప్రకారం కొద్ది రోజులపాటు జంక్ ఫుడ్‌కు విరామం వల్ల ఆకలి నియంత్రణ, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం, మెటబాలిజం మెరుగుపడటానికి దోహదం చేస్తుందని వెల్లడైంది. మొదట కొన్ని వారాలు శుద్ధి దశలా ఉండగా, తర్వాత శక్తి స్థిరంగా మారుతుంది. 60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేస్తే శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయో వైద్యులు వివరిస్తున్నారు.

## అతిగా తినడం తగ్గుతుంది..

60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేయడం వల్ల ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. జంక్ ఫుడ్ వల్ల ఆకలి నియంత్రణ దెబ్బతింటుంది. దీనివల్ల ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. అయితే 60 రోజుల పాటు దాన్ని మానేస్తే లెప్టిన్, ఘ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు సరిగా పనిచేయడం ప్రారంభిస్తాయి. దాంతో తృప్తి భావం సరిగ్గా తెలుస్తుంది. అలాగే కాలరీలు సహజంగా తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గిస్తే రోజువారీ క్యాలరీలు కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతాయి. దాంతో బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడం, శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. జంక్‌ఫుడ్ మానేయడం వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యం మెరుగుపడుతుంది. జంక్ ఫుడ్ గట్‌లో బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మానేస్తే గట్ లైనింగ్ మళ్లీ బలపడుతుంది, మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభంగా మారుతుంది. అంతేకాకుండా శరీర మెటబాలిజం మెరుగవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం వల్ల మెటబాలిజం సరిగా పనిచేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీని వల్ల శరీరానికి అవసరమైన శక్తి సమర్థంగా ఉత్పత్తి అవుతుంది.

## మెదడు పనితీరుకు..

ఇక జంక్ ఫుడ్ మానేయడం వల్ల మెదడు పనితీరు కూడా మెరుగవుతుంది. జంక్ ఫుడ్ మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మెమొరీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. 60 రోజుల తర్వాత మెదడు మళ్లీ సరిగా స్పందించడం ప్రారంభించి, ఫోకస్ పెరుగుతుంది, అనవసరమైనవి తినాలనే కోరికలు తగ్గుతాయి. అంతేకాకుండా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గుతుంది. జంక్ ఫుడ్ వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, ఇతర సమస్యలకు దారి తీస్తుంది. రెండు నెలలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, చర్మం మెరుగుపడటం, ఉబ్బరం తగ్గడం, కీళ్ల నొప్పులు తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. 60 రోజులు జంక్ ఫుడ్ మానేయడం కొంచెం కష్టంగా అనిపించినా, శరీరం చాలా త్వరగా ధన్యవాదాలు చెబుతుందని, బయట కనిపించే మార్పుల కంటే లోపల జరిగే మార్పులే ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పచ్చి మామిడి వర్సెస్ మామిడి పండు.. ఏయే పదార్థాల తయారీకి వేటిని వాడాలి..



మామిడి సీజన్ ప్రారంభమైతే మార్కెట్లు పచ్చి మామిడిపండ్ల నుంచి పండిన తీయని మామిడిపండ్లతో నిండిపోతాయి. ప్రతి ఒక్కరు వారికి నచ్చినవి కొనుగోలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ రెండింటికీ ప్రత్యేకమైన రుచి ఉండడంతోపాటు వంటల్లో వీటి ఉపయోగం కూడా వేరుగా ఉంటుంది. పచ్చి మామిడి తియ్యని, పులుపు రుచిని అందిస్తే, పండిన మామిడి సహజమైన తీపి, మృదుత్వాన్ని అందిస్తుంది. అందువల్ల వీటిని ఒకే పండుగా కాకుండా, వేర్వేరు పదార్థాలుగా చూడటం ఉత్తమం. పచ్చి మామిడి ప్రధానంగా పులుపు, కరకరలాడే టెక్స్చర్‌తో ఉంటుంది. అందుకే వంటల్లో తాజాదనాన్ని తీసుకురావడానికి ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో పచ్చి మామిడి ఉల్లాసాన్ని పెంచే రుచిని అందిస్తుంది. పచ్చి మామిడితో చేసే వంటల్లో ఆవకాయలు, పచ్చళ్ళు ముఖ్యమైనవి. కాయ గట్టిగా ఉండటం వల్ల మసాలాలు, నూనె కలిసిపోతాయి. పచ్చి మామిడి చట్నీలు కూడా భోజనానికి రుచిని పెంచుతాయి.

## ఆమ్ పన్నా ఆరోగ్యకరం..

సలాడ్లు, కచుంబర్‌లలో తురిమిన పచ్చి మామిడి కలిపితే రుచిలో ప్రత్యేకమైన మార్పు వస్తుంది. క్యారెట్, కీరదోసకాయ, పల్లీలు వంటి పదార్థాలతో కలిపితే కరకరలాడే, రుచికరమైన మిశ్రమంగా మారుతుంది. దాల్, కర్రీలలో కూడా పచ్చి మామిడి ఉపయోగిస్తారు. ఇది వంటకానికి తేలికపాటి పులుపును అందించి, రుచిని సమతుల్యం చేస్తుంది. కొబ్బరి ఆధారిత కర్రీల్లో ఇది తేలికపాటి తీపి-పులుపు సమతుల్యతను కలిగిస్తుంది. అలాగే వేసవిలో పచ్చి మామిడితో చేసే పానీయాల్లో ఆమ్ పన్నా ముఖ్యమైనది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు తక్షణ శక్తిని అందిస్తుంది. బెల్లం, మసాలాలు కలిపి తయారు చేసే ఈ పానీయం వేసవిలో ప్రత్యేకమైన ఉపశమనాన్ని ఇస్తుంది.

## అల్పాహారంగా పనిచేసే మామిడి పండ్లు..

ఇక పండిన మామిడి తీపి, సువాసన, మృదుత్వంతో వంటల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీన్ని డెజర్ట్స్‌లోనూ, పానీయాల్లోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. శ్రీఖండ్, కలాకండ్ వంటి మిఠాయిల్లో పండిన మామిడి అద్భుతంగా సరిపోతుంది. మామిడిని క్రీమ్‌తో కలిపినా, కేకులు, మఫిన్స్‌ల్లో వాడినా ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. స్మూతీలు, లస్సీలు, బౌల్స్‌లో పండిన మామిడి గట్టిగా, క్రీమీ టెక్స్చర్‌ను ఇస్తుంది. పెరుగు, పాలు లేదా కొబ్బరితో కలిపి తీసుకుంటే పోషకాహారంగా ఉంటుంది. ఇవి వేసవిలో త్వరగా తయారయ్యే అల్పాహారంగా కూడా ఉపయోగపడతాయి. పండిన మామిడితో సాల్సాలు, టాపింగ్స్ కూడా తయారు చేయవచ్చు. ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మరసం, మిరపకాయలతో కలిపితే తీపి-కారం సమతుల్యతతో వంటకానికి కొత్త రుచిని అందిస్తుంది. కొన్ని ప్రాంతీయ కర్రీల్లో కూడా పండిన మామిడి వాడతారు. బెంగాలీ, గోవా వంటల్లో ఇది మసాలాలతో కలిసిపోతూ తేలికపాటి తీపి రుచిని ఇస్తుంది. పచ్చి మామిడి ఉత్సాహం, పులుపు, కరకరలాడే గుణాన్ని ఇస్తే, పండిన మామిడి తీపి, మృదుత్వం, సంతృప్తిని అందిస్తుంది. వంటకానికి అవసరాన్ని బట్టి వీటిని ఎంచుకుంటే ప్రతి వంటకాన్ని ప్రత్యేకంగా మార్చుకోవచ్చు. వేసవి కాలంలో ఈ రెండు రకాల మామిళ్లతో ఎన్నో రుచికరమైన వంటకాలు సిద్ధం చేసుకోవచ్చు.

# ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక

ప్రకృతి సేద్య పద్ధతులపై ప్రామాణిక శిక్షణా మాన్యువల్‌ను వెలువరించిన నీతి ఆయోగ్

22 రకాల పంటల్లో ప్రకృతి సేద్య పద్ధతులపై పూర్తి సమాచారం

రసాయనిక-సేంద్రియ-ప్రకృతి సేద్యాల మధ్య వ్యత్యాసాలపైనా వివరణ



ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా వ్యాప్తిలోకి తేవాలన్న లక్ష్యంతో సమగ్రమైన ట్రైనింగ్ మాన్యువల్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ఇటీవలే వెలువరించింది. 'రైతులకు సాధికారత కల్పించటం: ప్రకృతి వ్యవసాయ శిక్షణా కిట్ -- ఉత్తమ పద్ధతుల మార్గదర్శిని' పేరుతో రూపొందించారు. ప్రకృతి సేద్య మూల సూత్రాలతో పాటు.. ముఖ్యమైన 22 రకాల పంటల సాగులో క్షేత్రస్థాయిలో ఆచరించదగిన ప్రామాణిక ప్రకృతి సేద్య పద్ధతులను పొందుపరిచారు. నీతి ఆయోగ్ వ్యవసాయం--సాంకేతిక విజ్ఞాన విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్, కన్సల్టెంట్ పరిమల్ బనఫర్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం దీన్ని రూపొందించింది. రైతులు, విస్తరణ సిబ్బంది, విధాన నిర్ణేతలకు సుస్థిర వ్యవసాయ విస్తరణ దిశా నిర్దేశం చేయటానికి ఈ శిక్షణా మాన్యువల్, ఉత్తమ ప్రకృతి సేద్య పద్ధతులకు అక్షర రూపం ఇచ్చినట్లు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. డాక్టర్ నీలం పటేల్ ఇలా అన్నారు: 'దేశవ్యాప్తంగా రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులు, ఆవిష్కరణలు, సంప్రదాయ విజ్ఞానంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రకృతి సేద్య అనుభవాల ఆధారంగా ఈ శిక్షణా మాన్యువల్‌ను రూపొందించాం. దేశంలో సుస్థిర వ్యవసాయాన్ని విస్తరింపజేయటంలో ఇదొక కీలక ముందడుగు'. ప్రకృతి వ్యవసాయ వారసత్వాన్ని సుసంపన్నం చేసిన సుభాష్ పాలేకర్ (మహారాష్ట్ర), ఎల్. నారాయణరెడ్డి (కర్ణాటక), శ్రీపాద దబోల్కర్, జి. నమ్మాళ్వార్ (తమిళనాడు), దీపక్ సచ్‌దే (మధ్యప్రదేశ్), భాస్కర్ సావే (గుజరాత్)ల సేవలను ఇందులో ప్రస్తుతించారు. దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్య పథకాలు అమలవుతున్నాయని, 9.4 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఇందులో పేర్కొన్నారు.

## అధిక దిగుబడి.. అధిక నికరాదాయం!

వరిని వరుసగా 4 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం (ప్ర.వ్య.)లో పండిస్తే 2023 ఖరీఫ్‌లో ఎకరానికి 33.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. రసాయన వ్యవసాయం (ర.వ్య.)లో 31.5 క్వింటాళ్లు వచ్చింది. ఈ రెండు ధాన్యాలను క్వింటా రూ.2,040కే విక్రయించారు. ప్ర.వ్య.లో నికరాదాయం రూ.48 వేలు రాగా, రూపాయి ఖర్చుకు 2.3 రూపాయల ఆదాయం ముచ్చింది. ర.వ్య.లో నికరాదాయం రూ.35,140 రాగా, రూపాయి ఖర్చుకు 1.2 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చింది. ప్రధాన పంటలన్నింటిలో సాగు ఖర్చును కనీసం 5--10% తగ్గిస్తుంది. మరికొన్ని పంటల్లో, కొన్ని రాష్ట్రాల్లో 20--55% వరకు తగ్గింది.

- ప్రకృతి వ్యవసాయం రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేలల్లో సేంద్రియ కర్బనం 1947లో 2.5% ఉండేది. ఇప్పటికి 0.4%కి తగ్గింది. ప్రకృతి వ్యవసాయం దీన్ని 45% వరకు పెంచుతుంది.
- నీరు, విద్యుత్‌లో 50--60% ఆదా అవుతుంది.
- కర్బన ఉద్గారాలను 55--85% తగ్గిస్తుంది.
- పశువులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచటం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పంటల వైవిధ్యం, అంతరపంటలు, బహుళ అంచెల పంటలతో వ్యవసాయాదాయ భద్రత, పోషకాహార భద్రత పెరుగు తాయి. రసాయనిక సేద్యం ఏకపంట సాగుతో పోలిస్తే 20--40% అధిక నికర ఆదాయం వస్తుంది.

## జీవామృతం.. 48 గంటలు పులిస్తే చాలు!

జీవామృతం కోసం పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లం, మట్టిని డ్రమ్ము నీటిలో కలిపిన తర్వాత 2--3 రోజులు పులియబెట్టి పంటలకు వాడుకోడానికి సిద్ధమైనట్లే. కలిపిన 48 గంటల్లో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో వృద్ధి చెందుతుంది. సిద్ధమైన జీవామృతాన్ని వేసవిలో 7 రోజుల వరకు, శీతాకాలంలో 8--10 రోజుల్లో వాడుకోవచ్చని నీతి ఆయోగ్ ప్రకృతి వ్యవసాయ శిక్షణ మాన్యువల్ చెబుతోంది.

## ప్రకృతి సేద్యానికి మార్గదర్శకం

రసాయనిక వ్యవసాయానికి ఒక సుస్థిరమైన ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయం. ఇటు సంప్రదాయ విజ్ఞానాన్ని అటు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని ఇముడ్చుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రూపొందాయి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీటైన సమాధానాలు ఇవ్వగలవు. తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతోనే వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటం సాధ్యమని ఈ పద్ధతులు చాటి చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు, విస్తరణ సిబ్బందికి ప్రకృతి సేద్య పద్ధతులపై శిక్షణ ఇవ్వటానికి ఈ మాన్యువల్ మార్గదర్శకంగా నిలుస్తుంది.

# వేసవిలో శరీరానికి చల్లదనాన్ని, పోషకాలను అందించే అద్భుతమైన పానీయం ఇది.. ఎలా తయారు చేయాలంటే..?



వేసవి కాలం ప్రారంభమయ్యాక చల్లని పానీయాలు రోజువారీ జీవితంలో భాగమవుతాయి. మార్కెట్‌లో రెడీమేడ్ డ్రింక్స్, మిక్స్‌లు సులభంగా లభిస్తున్నప్పటికీ, సంప్రదాయ భారతీయ పానీయాలకు ప్రత్యేక స్థానం ఇప్పటికీ ఉంది. అలాంటి ప్రసిద్ధ పానీయాల్లో తండాయి ఒకటి. ఇది రుచితోపాటు శరీరాన్ని చల్లబరచే గుణాల వల్ల ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సాధారణంగా హోలీ పండుగ సమయంలో ఎక్కువగా తయారుచేసే తండాయి, వేసవి మొత్తం తాగడానికి అనువైన పానీయం. పాలు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ రేకులు, కుంకుమపువ్వు కలిపి తయారు చేసే ఈ పానీయం శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, తాగిన వెంటనే తాజాగా అనిపించేలా చేస్తుంది. ఇంట్లో తండాయి మసాలా తయారు చేసుకోవడం వల్ల మనకు కావలసిన రుచులు, తీపి స్థాయి అన్నీ మనమే నియంత్రించుకోవచ్చు.

## ఇలా చేయాలి..

ఇంట్లో తండాయి మసాలా తయారీ చాలా సులభం. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు సోంపు, గసగసాలు, యాలకులు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటితోపాటు గులాబీ రేకులు, కుంకుమపువ్వు కూడా ప్రత్యేక సువాసనను ఇస్తాయి. తయారీ విధానంలో మొదట అన్ని డ్రై ఫ్రూట్స్, గింజలను శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తేమ లేకుండా ఉండేలా చూసుకోవాలి. తరువాత యాలకులు, మిరియాలు, సోంపు, గసగసాలు మొదటగా మెత్తగా పొడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, మెలన్ గింజలను వేసి కొద్దిగా దట్టంగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఆ తరువాత గులాబీ రేకులు, కుంకుమపువ్వు వేసి మరోసారి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం సువాసనతో కూడిన మసాలాగా తయారవుతుంది. పూర్తిగా చల్లారిన తరువాత గాలి చొరబడని సీసాలో నిల్వచేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.

## చల్లని పాలలో కలిపి..

ఈ మసాలాతో తండాయి తయారు చేయడం కూడా చాలా ఈజీ. చల్లని పాలలో ఒకటి లేదా రెండు టీస్పూన్లు మసాలా కలిపి, అవసరమైతే చక్కెర వేసి బాగా కలిపి సర్వ్ చేస్తే చాలు. ఇది శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడంలో సహాయపడుతుంది. ఇంట్లో తయారు చేసిన తండాయి మసాలా సహజమైన రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే ఇది తీపి ఎక్కువగా ఉండే పానీయం కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## యోగి పాలనలో పరాకాష్టకు మహిళలపై అత్యాచారాలు



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ లో యోగి ప్రభుత్వ పాలనలో మహిళలపై అత్యాచారాలు పరాకాష్టకు చేరాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ ఎంపి ప్రియాంక గాంధీ శనివారం పేర్కొన్నారు. ఒక మహిళపై అత్యాచారం జరిగిన ప్రతిసారి బాధితురాలి కుటుంబాన్ని మరింత వేధించడం లిఖించని చట్టంగా మారిందని మండిపడ్డారు. ఘాజీపూర్ లో ఒక బాలిక హత్య, ఆందోళనలకు, నిరసనలకు దారితీసిన ఘటనపై ప్రియాంక గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాజీపూర్ లో బాలిక హత్య కేసులో , మొదట కేసు నమోదు చేసేందుకు విముఖత చూపడం, ఆ తర్వాత బాధితురాలి కుటుంబానికి బెదిరింపులు, అధికార హోదాలో ఉన్న వ్యక్తులు గందరగోళం సృష్టించడం వంటి రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో మహిళపై అత్యాచారం జరిగినప్పుడల్లా, బాధితురాలిని మరింత వేధించడం అనేది లిఖించని చట్టంగా మారిందని అన్నారు. మహిళల గురించి ప్రధాని మోడీ ఇచ్చే వాగ్దానాలు కేవలం బూటకమని అన్నారు. ఉన్నావో, హత్రాస్, ప్రయాగ్ రాజ్, ఘాజీపూర్ ఎక్కడైతే మహిళలపై అన్యాయం జరిగిందో, అక్కడ బిజెపి తనకున్న పూర్తి అధికారంతో బాధితురాలికి వ్యతిరేకంగా, అణచివేసే వారి పక్షాన నిలుస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు ఈ అన్యాయాన్ని చూస్తున్నారని అన్నారు. బిజెపి పాలనలో అణగారిన, వెనుకబడిన వర్గాలపై అక్రమాలు అనేక రెట్లు పెరిగాయని యుపి కాంగ్రెస్ నేత అనిల్ యాదవ్ పేర్కొన్నారు. అధికారుల మద్దతుతోనే ఘాజీపూర్ లో రాజకీయ కార్యకర్తల బృందంపై దాడి జరిగిందని, తమ హక్కులను డిమాండ్ చేసే గొంతుకలను అణచివేయడానికి బిజెపి ప్రభుత్వం గూండాలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. గతవారం ఘాజీపూర్ లోని కటారియాలో విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన 16ఏళ్ల బాలిక హత్యకు గురైన సంగతి తెలిసిందే.

# జపాన్ లో కార్చిచ్చు



న్యూఢిల్లీ : ఉత్తర జపాన్ లోని ఒక పట్టణంలో నివాస ప్రాంతాల సమీపంలో అడవుల్లో కార్చిచ్చు రగులుకుంది. వేర్వేరు ప్రాంతాల్లో రెండు అగ్నిప్రమాదాలు జరగడం వల్ల నివాసితులు త్రీవ ఇబ్బందులు పడ్డారని అధికారులు శుక్రవారం వెల్లడించారు. దాదాపు మూడు వేల మందిని ఆ ప్రదేశం నుంచి సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. బుధవారం మధ్యాహ్నం ఇవాటే ప్రిఫెక్చర్‌లోని ఒక పర్వత ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత సుమారు రెండు గంటల తర్వాత దాదాపు 10 కిలోమీటర్ల (6.2 మైళ్ల) దూరంలో ఉన్న ఒట్సుచి పట్టణం సమీపంలో మరో అగ్నిప్రమాదం సంభవించింది. అయితే అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నటికీ శ్రుకవారం రోజుకి కూడా ఇంకా అదుపులోకి రాలేదని ప్రభుత్వ ప్రసార సంస్థ ఎన్ హెచ్ కె తెలిపింది. కాగా, ఈ అగ్నిప్రమాదాల వల్ల సుమారు 2,905 ఎకరాలకు పైగా ఉన్న వన్యజాతి నాశనమైంది. 1,541 కుటుంబాలు, 3,233 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వీరందరిని అగ్నిమాపక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఒక గృహంతోపాటు, ఏడు భవనాలకు మంటలు అలుముకున్నాయి. 2025 తర్వాత ఇదే అతిపెద్ద అగ్నిప్రమాదమని అధికారులు వెల్లడించారు. 2025లో ఒఫునాటోలో జరిగిన అగ్నిప్రమాదానికి సుమారు 3,370 హెక్టార్లలోని వృక్ష సంపద ఆహుతైంది.

## స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం సరైన పని కాదు : అన్నాహజారే



అహిల్యా నగర్ (మహారాష్ట్ర) : ఆప్ ఎంపి రాఘవ్ చద్దాతోపాటు అశోక్ మిట్టల్ తో సహా ఏడుగురు ఎంపీలు బిజెపిలోకి మారారు. ఈ పరిణామం ఆప్ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆప్ ఎంపీలు బిజెపిలోకి మారడం పట్ల సామాజిక కార్యకర్త , ఆ పార్టీ ప్రధాన స్రూతధారి, సైద్ధాంతిక మార్గదర్శకుడు హజారే ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు మారడం సరైన పని కాదని ఆయన అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఒక పార్టీని వీడి మరొక పార్టీలో చేరడం సరైంది కాదు. మన స్వార్థ అవసరాల కోసం రాజకీయ పార్టీలను మార్చడం సరైన పని కాదు. ఈ విషయం మన రాజ్యాంగంలో పేర్కొనబడలేదు. మన రాజ్యాంగం సర్వోన్నతమైనది. మన దేశం రాజ్యాంగం ఆధారంగానే నడుస్తుంది- అని ఆయన అన్నారు. కాగా, 2011లో హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమం ద్వారానే అవినీతిని అంతమొందించడానికే ఆప్ పార్టీ ఏర్పడింది. అప్పుడే అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు.ఽ

## రెండు దశాబ్దాల తర్వాత గాజాలో ఎన్నికలు



గాజా : 2023 అక్టోబర్ 7న ప్రారంభమైన గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల వేలాది మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. అంతకుముందు నుంచే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత స్థానిక ఎన్నికల్లో తాజాగా గాజాను కూడా చేర్చడం జరిగింది. 2023 అక్టోబర్ తర్వాత గాజాలో జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవే. ఈ నేపథ్యంలో శనివారం వెస్ట్ బ్యాంక్, సెంట్రల్ గాజాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పాలస్తీనియన్లు శనివారం ఓటేశారు. ఈ ఎన్నికల్లో పాలస్తీనియన్లు తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్లో సుమారుగా 1.5 మిలియన్ల మంది, గాజాని దేర్ ఎల్--బలా ప్రాంతంలో 70,000 మంది ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారని రామల్లా కేంద్రంగా సెంట్రల్ ఎన్నికల కమిషన్ పేర్కొంది.

# వడదెబ్బకు పొగ పెడదామా?

వేసవి తారెత్తిస్తోంది. ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. హీట్ వేవ్ వార్నింగులు, జాగ్రత్తలు పాటించాలంటూ సూచనలు కోకొల్లలుగా వచ్చేస్తున్నాయ్. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ చర్చోపచర్చలు కూడా సాగిపోతున్నాయ్. ఈ నేపథ్యంలో ఈ వడగాలులు మన శరీరంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? వాటిని ఎలా ఎదుర్కోవాలో ఓ లుక్కేద్దాం రండి.

### వడగాలులు అంటే..?

సింపుల్‌గా చెప్పాలంటే వేడి గాలులు. వాతావరణం ఎగువన (9,800--24,900 అడుగులు) ఉన్న అధిక పీడన ప్రాంతం బలపడి.. కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల వరకు ఒక ప్రాంతంపై నిలిచి ఉన్నప్పుడు వడగాలులు ఏర్పడతాయి. 1950లలో నుంచి భూమిపై దాదాపు ప్రతి ప్రాంతంలోనూ వేడిగాలులు అంతకంతకూ పెరుగుతున్నాయ్. వాతావరణ మార్పుల వల్ల 2024 నుంచి ఇవి మరింత తీవ్రతరం అయ్యాయి. అనేక ప్రాంతాలు 45 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలను చవిచూస్తున్నాయ్.

### మనపై ఎలాంటి ప్రభావం?

ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ మానవ శరీరం ఒత్తిడికి గురవుతుంది. సాధారణంగా మన శరీరం 37 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద చక్కగా పనిచేస్తుంది. ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్ దాటిన తర్వాత శ్వాస వేగవంతమవుతుంది. హృదయ స్పందన రేటు పెరుగుతుంది. 40 డిగ్రీల సెల్సియస్ వద్ద శరీరం చల్లగా ఉండటానికి చాలా కష్టపడుతుంది. దీనివల్ల శక్తి వినియోగం దాదాపు 35% పెరుగుతుంది. శరీర అంతర్గత ఉష్ణోగ్రత కొంతసేపు స్థిరంగా ఉన్నప్పటికీ, ఎక్కువసేపు ఈ వేడికి గురికావడం ప్రమాదకరం. 42 డిగ్రీల సెల్సియస్ దాటిన ఉష్ణోగ్రతలు తీవ్రమైన హానిని కలిగిస్తాయి. అందువల్ల మన శరీర ఉష్ణోగ్రతను 37 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద స్థిరంగా ఉంచడానికి మన మెదడులో ఉండే హైపోథాలమస్ అనే భాగం పనిచేస్తుంటుంది. అయితే, బయట మరీ వేడి వాతావరణం ఉంటే మన శరీరం ఆ వేడిని నిరంతరాయంగా గ్రహిస్తుండటం వల్ల చల్లబరచడం కష్టమవుతుంది. మన శరీరంపై ఏర్పడిన చెమట ఆవిరయ్యే పరిస్థితిపై ఇది ఆధారపడి ఉంటుంది. పొడి వాతావరణంలో చెమట త్వరగా ఆవిరై మన శరీరంలోని అధిక వేడిని వెంటనే తొలగిస్తుంది. అదే తేమతో కూడిన రోజులలో తేమ గాలిలో నిండి ఉండటం వల్ల చెమట ఆవిరి కావడం నెమ్మదిస్తుంది. దీంతో శరీరం వేగంగా వేడెక్కడానికి, వడదెబ్బకు గురికావడానికి కారణమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం తన అంతర్గత వేడిని నియంత్రించుకోవడానికి అధికంగా కష్టపడాల్సి వస్తుంది. అప్పుడు గుండె, మూత్రపిండాలు అధిక ఒత్తిడికి లోనవుతాయి.



### మెదడుకూ ముప్పే..

అధిక వేడి శరీరంపైనే కాకుండా నాడీ సంబంధిత ముప్పుగానూ పరిణమిస్తోంది. మెదడుపై ఇది చూపించే ప్రభావం.. మైగ్రేన్లు, మూర్ఛల నుంచి మానసిక రుగ్మతలు, పక్షవాతం రావడం వరకు కారణమవుతోంది. మనం ఆలోచిస్తున్నప్పుడు, ఏదైనా పని చేస్తున్నప్పుడు, దేనికైనా ప్రతిస్పందించినప్పుడు మెదడు కొంచెం వేడిని విడుదల చేస్తుంది. అప్పుడు శరీరం దానిని చల్లబరుస్తుంటుంది. ఇది నిరంతరం జరుగుతూ ఉంటుంది. ఎప్పుడైనా ఈ ప్రక్రియ ఫెయిలైతే మొత్తం శరీర వ్యవస్థ అదుపు తప్పుతుంది. వేడి వాతావరణం మనం నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంపైనా ప్రభావం చూపిస్తుంది. అంతేకాకుండా మధుమేహం లేదా మూత్రపిండాల వ్యాధి వంటి సమస్యలు ఉన్నవారిలో అధిక వేడి సమయంలో వడదెబ్బ, కండరాల నొప్పుల నుంచి తీవ్రమైన డీహైడ్రేషన్, వడదెబ్బ వరకు సంభవించవచ్చు, వడదెబ్బ వల్ల అధిక చెమట, నీరసం, వికారం, కండరాల నొప్పులు కలుగవచ్చు. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటి.. తీవ్రమైన వడదెబ్బగా మారితే.. అది గందరగోళం, మూర్ఛలు, అవయవ వైఫల్యానికి కూడా దారితీయవచ్చు. అధిక చెమట పట్టడం వల్ల నిర్జలీకరణం (డీహైడ్రేషన్), అవసరమైన లవణాల నష్టం కూడా జరగవచ్చు, దీనివల్ల తల తిరగడం, స్పృహ కోల్పోయే ప్రమాదం పెరుగుతుంది. అత్యధిక వేడి జీర్ణవ్యవస్థ పనితీరును కూడా నిశ్శబ్దంగా దెబ్బతీస్తుంది. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు.. శరీరం ప్రధాన ప్రాధాన్యం చల్లగా ఉండటమే. ఇందుకోసం చెమట ద్వారా వేడిని విడుదల చేయడానికి శరీరం చర్మానికి ఎక్కువ రక్తాన్ని పంపుతుంది. ఈ మార్పు వల్ల జీర్ణవ్యవస్థకు రక్త ప్రసరణ తగ్గి, జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. ఫలితంగా కడుపులో భారంగా అనిపించడం, ఆకలి తగ్గడం, యాసిడ్ రిఫ్లక్స్ లేదా సాధారణ అజీర్ణం వంటి సమస్యలను ఎదుర్కోవచ్చు. శరీరంలో నీటి శాతం తగ్గడం వల్ల ఇది మరింత తీవ్రమవుతుంది. శరీరంలో తగినంత ద్రవాలు లేనప్పుడు, జీర్ణక్రియ మరింత మందగిస్తుంది, దీనివల్ల మలబద్ధకం, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు ముఖ్యంగా వృద్ధులలో, వేడి వాతావరణంలో తగినంత నీరు తాగని వారిలో సర్వసాధారణంగా కనిపిస్తాయి.

### ముప్పు తప్పాలంటే ఏం చేయాలి?

సాధ్యమైనంత వరకు ఇంటి లోపలే ఉండాలి. ముఖ్యంగా మధ్యాహ్నం 12--3 గంటల మధ్యలో బయటకు వెళ్లొద్దు. దాహం లేకున్నా ఎప్పటికప్పుడు నీళ్లు తాగుతూ ఉండాలి. తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలి. ఎండలో కష్టసాధ్యమైన పనులు చేయకూడదు. ఓఆర్ఎస్, లస్సీ, నిమ్మకాయ నీళ్లు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. అధిక ప్రొటీన్ ఉన్న, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. పిల్లలు, జంతువులను పార్క్ చేసి ఉన్న వాహనాల్లో వదిలిపెట్టకూడదు. ఆల్కహాల్, టీ, కాఫీ వంటివి తాగకూడదు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి తడి గుడ్డతో తుడవాలి లేదా మామూలు నీళ్లను తలపై చల్లాలి. ఓఆర్ఎస్, నిమ్మకాయ నీళ్లు లేదా గంజి వంటి రీహైడ్రేట్ పానీయాలు అందించాలి. వెంటనే వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాలి.

# ఇలాంటి ఓ అంతర్యుద్ధం జరుగుతోందని తెలుసా?

మనుషుల చరిత్రలో యుద్ధాలు, అంతర్యుద్ధాలు తరచుగా కనిపిస్తాయి. రాజ్యాల కోసం, మతాల కోసం, జాతుల కోసం జరిగిన ఈ పోరాటాలు సమాజాలను శాశ్వతంగా మార్చేశాయి. కానీ మనం ఇప్పుడు చెప్పుకోబోయేది కాస్త ఆశ్చర్యకరమైన విషయమే. ఇలాంటి అంతర్యుద్ధాలు జరుగుతాయని.. వాటి ఫలితంగా 11 ఏళ్లుగా నిత్యం కారడవిలో రక్తపాతం జరుగుతోందని మీకు తెలుసా?.. ఉగాండాలోని కిబాలే నేషనల్ పార్క్.. ప్రపంచంలోనే అతిపెద్ద చింపాంజీ సమూహంగా పేరుగాంచిన న్గోగో కమ్యూనిటీకి కేరాఫ్. సాధారణంగా చింపాంజీలు 50 లోపే ఒక సమూహంగా ఉంటాయి. కానీ, న్గోగో జాతివి మాత్రం 200లకు పైనే కలిసి ఉండేవి. ఇది పరిశోధకులను ఎంతో ఆశ్చర్యపరిచేది. ఒకప్పుడు కలిసే ఉంటూ.. కలిసే వేటాడుతూ.. కాలం వెల్లదీస్తుంటాయివి. అలాంటిది ఓరోజు అనూహ్యమైన పరిస్థితి చోటు చేసుకుంది. ఉన్నట్లుండి.. ఆ చింపాంజీ గ్రూప్ రెండుగా విడిపోయింది. ఒకదానితో మరొకటి విచిత్రంగా ప్రవర్తించడం మొదలుపెట్టాయి. నెమ్మదిగా అది ఘర్షణలకు దారి తీసింది. మనుషుల్లాగే.. అవి గ్యాంగ్ వార్‌లు చేస్తుండడం, పక్కా ప్లానులతో ప్రత్యర్థులు దాడులు చేయడం ఆశ్చర్యం కలిగించాయి. చివరకు వాటిలో అవి కొట్టుకుని చంపుకునే దాకా వెళ్లింది పరిస్థితి. అలా.. 2015 నుంచి ఇప్పటిదాకా ఏడు పెద్ద చింపాజీలు, మరో 17 పిల్ల చింపాంజీలు మరణించాయి. మరో 14 చింపాంజీలు జాడ లేకుండా పోయాయి. ప్రస్తుతం వెస్టర్న్ గ్రూప్, సెంట్రల్ గ్రూప్‌ల మధ్య అంతర్యుద్ధంతో నిత్యం కిబాలేలో రక్తం చిందుతోంది. ప్రఖ్యాత పరిశోధకుడు ఆరన్ సాండెల్ ఈ సంఘటనను "చింపాంజీల సివిల్ వార్"గా అభివర్ణించారు. 2014లో ఆ కమ్యూనిటీని అదుపు చేసిన కొన్ని చింపాజీలు వ్యాధులతో చనిపోవడం.. కొత్త 'ఆల్ఫా మేల్' రావడం వల్ల సంబంధాలు బలహీనపడ్డాయని చెబుతున్నారాయన. ఆయన మాటల్లో.. ఇది



మనుషుల మధ్య మతం, జాతి కోసం జరుగుతున్న యుద్ధంలా కాదు. సంబంధాలు, ఆధిపత్యం, సామాజిక బంధాలు బలహీనపడటం వల్లే చింపాంజీల మధ్య విభజన జరిగింది అని అభిప్రాయపడ్డారు. ఈ సంఘటనను 70వ దశకంలో జేన్ గూడాల్ గోంబే నేషనల్ పార్క్(టాంజానియాలోని అతి చిన్న నేషనల్ పార్క్)లో జరిగిన "ఫోర్ ఇయర్ వార్"తో పోలుస్తున్నారు. అప్పట్లో కూడా ఒకే సమూహంలో పెరిగిన చింపాంజీలు.. కహామా, కసకెలా కమ్యూనిటీలుగా విడిపోయి చంపుకున్నాయి. అయితేనీ వైరంతో తక్కువ కాలంలోనే ఆ జాతి మొత్తం తుడిచిపెట్టుకుని పోయింది. న్గోగో చింపాంజీల యుద్ధం ఎలా ముగుస్తుందో పరిశోధకులకు అంతుచిక్కడం లేదు. ఇక్కడ మూడు అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఒకటి.. సెంట్రల్ గ్రూప్ తమను తాము బలపరుచుకుని రక్షించుకోవడం. రెండోది.. వెస్టర్న్ గ్రూప్ పూర్తిగా ఆధిపత్యం సాధించి సెంట్రల్ గ్రూప్‌ను అంతమొందించడం. మూడోది.. రెండు గ్రూపులు మళ్లీ కలిసిపోవడం. అయితే చివరిది చాలా అరుదుగా జరిగే అవకాశం అని పరిశోధకులు చెబుతున్నారు.

# 'డిజిటల్' కేసులో పరిహారం!

జేబులు కొట్టడం, దారి దోపిడీలు చేయడం, దొంగతనాలకు పాల్పడటం, నమ్మించి మోసగించటం... ఇవన్నీ పాతకాలపు నాటు పద్ధతులు. 2016లో పెద్దనోట్ల రద్దుతర్వాత దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులు మొదలై వీటన్నిటినీ మరపించేలా కొత్త కొత్తదోపిడీ విధానాలు రంగప్రవేశం చేస్తున్నాయి. అందులో తాజాగా వచ్చిచేరిన 'డిజిటల్ అరెస్టు' వీటన్నిటినీ తలదన్నింది. ఈ మార్గాల్లో పౌరులు కోల్పోతున్న సొమ్ము వందల్లోంచి వేలల్లోకి... అక్కడి నుంచి లక్షలు దాటి ఇప్పుడు కోట్లాది రూపాయలకుచేరటంతో మన వ్యవస్థల్లో చలనం వచ్చినట్టుంది. అందుకే కావొచ్చు... ఇటీవల రిజర్వ్ బ్యాంకు స్వతంత్ర ప్రతినిధి (అంబుడ్స్‌మన్) ఈ తరహాలో రూ. 22.93 కోట్లు పోగొట్టుకున్న నరేష్‌చంద్ర అనే బాధితుడికి కోటీ 31 లక్షల పరిహారం చెల్లించాలని అయిదు బ్యాంకుల్ని ఆదేశించింది. ఆన్‌లైన్ లావాదేవీల్లో లక్షలాది రూపాయలు నష్టపోతున్న బాధితులు తమ మూర్ఖత్వాన్నీ, తెలివితక్కువతనాన్నీ తిట్టుకుని రోదిస్తు న్నారు. 'డిజిటల్ అరెస్టు'లో రూ. 8 కోట్లు కోల్పోయిన ఉదంతంలో పంజాబ్ మాజీ ఐజీ అమర్‌సింగ్ చాహల్ ఆత్మహత్యాయత్నం చేశారు. ఫిర్యాదులిచ్చినా తిరిగి రాబట్టుకునే సొమ్ము అంతంతమాత్రంగానే ఉంటున్నది. సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేయ టానికి వెళ్తే 'ఆ మాత్రం తెలియదా?' అంటూ ఎదురయ్యే చీవాట్లను భరించటంఅదనపు కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో అంబుడ్స్‌మన్ నిర్ణయం బాధితులకు ఉపశమనంకలిగిస్తుంది. ఈ మోసాలు పౌరులకు పెద్ద తలనొప్పిగా మారాయి. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే 'మన్ కీ బాత్'లో 'డిజిటల్ అరెస్టు' మోసాల గురించి ప్రస్తావించాక, మీడియాలో రిజర్వ్ బ్యాంకు తరఫున భారీ ప్రకటనలివ్వటం మొదలైనాక జనంలో ఏదోమేరకు చైతన్యం వచ్చిన సంగతి వాస్తవమే. అయితే ఇంకా మోసపోయేవారిసంఖ్య తగ్గటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మోసాల కారణంగా జనం రూ. 34,771 కోట్లు కోల్పోయారని రిజర్వ్ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కేవలం 'డిజిటల్ అరెస్టు'ల వాటాయే రూ. 1,900 కోట్లు ఉంది. 2022లో 10.29లక్షలున్న కేసులు 2024 నాటికి 22.68 లక్షలకు చేరాయి. గత మూడేళ్లలో జనం నుంచి మాయగాళ్లు కొట్టేసిన సొమ్ము 1.25



లక్షల కోట్లు! సిబ్బంది కొరత మాటెలావున్నా, పోలీసు విభాగాల్లో సైబర్ నేరాల దర్యాప్తు, ఆచూకీ రాబట్టడం వగైరాల్లో చాలామందికి పకడ్బందీ శిక్షణ లేదు. ఈ మాదిరి నేరాలకు పాల్పడేవారు వేరే రాష్ట్రాలకూ, వేరే దేశాలకూచెందినవారు కావటం, దర్యాప్తు చేయటానికి పెద్ద ఆటంకంగా మారింది. నియంత్రణ వ్యవస్థలు ఈ మోసాలను అరికట్టడానికి కొత్త ఉపకరణాలు కనుక్కొనే లోగానే నేరగాళ్లు ఏఐతో, ఇతరేతర మార్గాల్లో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. 2000 సంవత్సరంలో వచ్చిన ఐటీ చట్టం, 2023 నాటి డేటా పరిరక్షణ చట్టం వంటివి మధ్యస్తంగా ఉండే సంస్థలపై బాధ్యత మోపాయి. కానీ ఆచరణలో పెద్దగా ప్రయోజనం లేదు. అంబుడ్స్‌మన్ నిర్ణయం ఈ నేరాలను అరికట్టడంలో ముందడుగు. అసలు ఖాతాదార్లకు తెలియకుండా దొంగసొమ్ము రాకపోకలకు నేరగాళ్లు వాడుకునే 'మ్యూల్ అకౌంట్‌ల' పనిబట్టేందుకు ఇటీవల ప్రయత్నాలు మొదలయ్యాయి. బ్యాంకుల నిష్క్రియాపరత్వం కావొచ్చు... సిబ్బంది కుమ్మక్కుకావటం వల్ల కావొచ్చు ఇవిఇన్నాళ్లూ నిర్నిరోధంగా సాగిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో నేరగాళ్లకు సహకరించేబ్యాంకు సిబ్బందిని పోలీసులు ఈమధ్యే అరెస్టు చేశారు. ఈ మార్గంలోనే అంబుడ్స్‌మన్ సైతం ఖాతాదారు వివరాలు సేకరించటానికి, ద్రవ్య అక్రమ చలామణిని అరికట్టడానికి ఉన్న నిబంధనల్ని పాటించటంలో అలసత్వం ప్రదర్శించినందుకు నరేష్‌చంద్ర కేసులో పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అయితే దీంతో ఆయన సంతృప్తిపడదల్చుకోలేదు. రిజర్వ్‌బ్యాంకు మార్గదర్శకాలు పాటించని ఆ బ్యాంకులనుంచి తాను కోల్పోయిన మొత్తం రూ. 22.93 కోట్లు ఇవ్వటంతోపాటు నష్టపరిహారం, వడ్డీ, క్యాపిటల్ గెయిన్స్ పన్నుకయ్యే ఖర్చుతో సహా వెనక్కి ఇప్పించాలని నరేష్‌చంద్ర పోరాడతానంటున్నారు. ఆన్‌లైన్ మోసాల్లో బాధితులుగా మారుతున్నవారు పోలీసు కేసులు పెట్టడంతోపాటు, బ్యాంకుల అలసత్వం ఉన్నపక్షంలో వాటిపై కూడా న్యాయపోరాటం చేయటానికినరేష్‌చంద్ర కేసు స్ఫూర్తిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.

# రెడ్ డ్రెస్ లో మానస అందాలు..





సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్ ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్ కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్ ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్ లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్ ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా ఘాటు మిర్చీలా రెడ్ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి.అందం , అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్టైల్ తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ . ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్ తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్ లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. అసలు గుట్టు విప్పిన నిఖిల్ ఇకపోతే ఈ లుక్ లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది. ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి. మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరఫున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.



# ప్రొటీన్లతో అలసట మాయం!

ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్స్టైల్తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

నట్స్

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

పాలు, పాల పదార్థాలు

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల



పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

సోయాబీన్స్

సోయాబీన్స్లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

ఇవి కూడా!

జి బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది. జి చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి. జి మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు. జి కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి

# మినీ ఫ్రాక్ లో పిచ్చెక్కిస్తున్న సిమ్రాన్ చౌదరి..

ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులను అలరించడానికి నిత్యం పరితపిస్తున్న హీరోయిన్స్ ఎంతోమంది ఉన్నారు. ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందు దర్శనమిచ్చే ఈ అమ్మాయిలు.. తమ అందాలతో యువతను విపరీతంగా అలరిస్తున్నారు అనడంలో సందేహం లేదు. నిత్యం సినిమా షూటింగ్ లతో బిజీగా ఉండే ఈ హీరోయిన్స్ అభిమానులను ఎప్పటికప్పుడు అలరించడానికి భిన్న విభిన్నమైన వస్త్రధారణలతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫోటోషూట్ అంటూ ప్రత్యేకంగా కొన్ని ప్రదేశాలను కూడా ఎంపిక చేసుకొని తమ అందాలతో ఆడియన్స్ హృదయాలను దోచుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రముఖ యంగ్ బ్యూటీ సిమ్రాన్ చౌదరి కూడా తన అందాలతో ఆకట్టుకోవడానికి మరోసారి అభిమానుల ముందుకు వచ్చేసింది. అయితే ఈసారి తన ఫోటోషూట్ ను టెన్నిస్ కోర్టు నుంచి షేర్ చేసుకోవడం గమనార్హం. స్కై బ్లూ అండ్ వైట్ మినీ స్కర్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. పైగా ఉల్లి పొరలాంటి వైట్ కలర్ షర్ట్ ధరించి పలు రకాల ఫోజులతో యువతను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సిమ్రాన్ చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా అమ్మడి అందానికి ముగ్ధులవుతున్నారు. విశ్వక్ సేన్ పాగల్, అథర్వ వంటి చిత్రాలతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న సిమ్రాన్ చౌదరి ఈ ఏడాది 'వనవీర' సినిమాతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. 2026 జనవరి 1న విడుదలైన తెలుగు యాక్షన్ డ్రామా చిత్రంగా వచ్చిన ఈ చిత్రానికి అవినాష్ తిరువీధుల దర్శకత్వం వహించారు. నందు విజయ్ కృష్ణ తో కలిసి నటించారు. పౌరాణిక ప్రేరేపిత యాక్షన్ చిత్రమే కానీ అంచనాలు పెద్దగా లేకపోవడం వల్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్దగా రాణించలేదు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు. మరోవైపు టీవీ సిరీస్ 'మిషన్ తఫాసీ' లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'ఈ నగరానికి ఏమైంది?' సీక్వెల్ లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ నగరానికి ఏమైంది రిపీట్ ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. కాలేజ్ ఫ్రెండ్షిప్, ఫన్, కలలు వంటి అంశాలను మిళితం చేస్తూ చాలా సహజంగా చూపించిన ఈ నగరానికి ఏమైంది అనే సినిమా అప్పట్లో సూపర్ హిట్ గా నిలిచింది . ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా ఈ నగరానికి ఏమైంది రిపీట్ అంటూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా సాగుతోంది. మొత్తానికైతే సిమ్రాన్ చౌదరి ఇలా ఒకవైపు వరుస సినిమాలలో హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.





# 2027:టాప్ క్రేజీ పాన్ ఇండియా మూవీస్ ఇవే!





పాన్ ఇండియా సినిమాల ప్రవాహం తరువాత ఎక్కడా చూసినా, ఏ నోట విన్నా వినిపిస్తున్న మాట సౌత్..సౌత్.. బాలీవుడ్ ప్రభావం భారీగా తగ్గడం, క్రేజీ స్టార్ల సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్లుగా మారడంతో సౌత్తో పాటు నార్త్ ప్రేక్షకులు కూడా ఇప్పుడు సౌత్ సినిమాల జపం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది సౌత్ నుంచి భారీ క్రేజీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతున్నాయి. వేల కోట్ల మేర బిజినెస్ చేయడానికి రెడీ అవుతున్నాయి. అందులో టాప్ 4 సినిమాలపై ఇప్పుడు ప్రత్యేకమైన చర్చ జరుగుతోంది. 2027లో అత్యంత హైప్పి సొంతం చేసుకున్న సినిమాలు రజనీ-కమల్ల కాంబినేషన్ల రానున్న భారీ మల్టీస్టారర్ ఒకటి. ఇదే తరహాలో అల్లు అర్జున్, అట్లీల కాంబినేషన్లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ మూవీ మరొకటి. జక్కన్న, సూపర్ స్టార్ మహేష్బాబుల తొలి కాంబినేషన్లో రూపొందుతున్న -వారణాసి- మూడవది. క్రేజీ సినిమాలతో దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్న సందీప్రెడ్డి వంగ, ప్రభాస్ కలయికలో రూపొందుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ -స్పిరిట్- నాలుగవది. ఈ వరుసలో రజనీ- కమల్ మూవీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. దాదాపు 46 విరామం తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న భారీ మల్టీస్టారర్ మూవీగా దీన్ని చెబుతున్నారు. డార్క్ కామెడీ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ మూవీకి -జైలర్- డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నాడు. ఇటీవలే దీనికి సంబంధించిన ఓ ప్రోమోని కూడా షూట్ చేసినట్టుగా తెలిసింది. ఈ ప్రాజెక్ట్పై భారీ అంచనాలున్నాయి. 80వ దశకం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా దీన్ని నెల్సన్ తెరకెక్కించబోతున్నాడు. బిజినెస్ కూడా రికార్డు స్థాయిలో జరగనున్న ఈ మూవీ 2027లో వన్ ఆఫ్ ద టాప్ టాక్డ్ మూవీగా నిలుస్తుందని తెలుస్తోంది. -పుష్ప 2- వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తరువాత బన్నీ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్లో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీపిక పదుకునే మెయిన్ హీరోయిన్గా నటిస్తున్న ఈ మూవీని హాలీవుడ్ స్టార్ సూపర్ హీరో మూవీగా తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్పై ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే అత్యంత భారీ బడ్జెట్ ఫిల్మ్గా దీన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే రష్మిక ఇప్పటికే సెట్లోకి ఎంట్రీ ఇవ్వడం, యాక్షన్ ఘట్టాల్లో పాల్గొనడంతో సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ మూవీకి వర్క్ చేస్తున్నారు. ఇది వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సూపర్స్టార్ మహేష్ బాబు, జక్కన్నల తొలి కాంబినేషన్లో రూపొందుతున్న మూవీ -వారణాసి-. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక విలన్ పాత్రలో నటిస్తుండగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్గా నటిస్తోంది. ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని టైమ్ ట్రావెల్, మైథలాజికల్ డ్రామాగా రాజమౌళి తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్గా మారిన ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ప్రభాస్ నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా -స్పిరిట్-. సందీప్రెడ్డి వంగ దర్శకుడు. ప్రకాష్రాజ్, కాంచన, వివేక్ ఓబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ప్రభాస్ ఫస్ట్ టైమ్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్గా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డ్స్ని తిరగరాయాలని సందీప్రెడ్డి వంగ ప్లాన్ చేస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చి 5న పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు -రామయణ 2- కూడా వచ్చే ఏడాదే రానుంది. 2027 దీపావళికి ఈ భారీ మూవీని రిలీజ్ చేయబోతున్నారు. ఫస్ట్ పార్ట్ 2026 దీపావళి సందర్భంగా నవంబర్ 8న రిలీజ్ కాబోతోంది.

# బాలయ్య, వంశీతో మూవీ.. పవన్ డైరెక్టర్ ప్లాన్ ఏంటి?



టాలీవుడ్ లో ఇంట్రెస్టింగ్ కాంబినేషన్లకు ఎప్పుడూ స్పెషల్ క్రేజ్ ఉంటుందని చెప్పాలి. అలాంటి మరొక కాంబో ఇప్పుడు ఫిక్స్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. నటసింహం నందమూరి బాలకృష్ణ, ప్రముఖ నిర్మాత నాగవంశీ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబోలో మూవీ దాదాపు ఖరారైనట్లు వార్తలు వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో అధికారిక ప్రకటన కూడా రానుందని వినికిడి అయితే చాలా కాలంగా బాలయ్యతో సినిమా చేయాలన్న ప్రయత్నంలో ఉన్న హరీష్ శంకర్ కు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ దొరికిందన్న టాక్ వినిపిస్తోంది. నిజానికి మాస్ ఎంటర్టైన్మెంట్ సినిమాలు తీయడంలో హరీష్ శంకర్ టాలెంట్ తెలిసిందే. గబ్బర్ సింగ్, మిరపకాయ్, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి సినిమాలతో తన మార్క్ చూపించారు. ముఖ్యంగా స్టార్ హీరోలను మాస్ ఆడియన్స్ కు మరింత దగ్గర చేయడం ఆయన స్పెషాలిటీ. మిస్ ఇండియా కిరీటం మిస్ అయినా.. వెండితెర 'రంభ'గా ఆమె మేజిక్ తగ్గలేదు! ఇప్పుడు బాలయ్య బాడీ లాంగ్వేజ్ కు సరిపోయే పవర్ ఫుల్ స్టోరీ రెడీ చేశాడని సమాచారం. నాగవంశీ నిర్మాణంలో భారీ బడ్జెట్ తో ఆ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందట. అయితే హరీష్ శంకర్ ప్రస్తుతం ఫామ్ లో లేరనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఇటీవల రవితేజతో చేసిన మిస్టర్ బచ్చన్ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ కలిగించింది. డిజాస్టర్ గా నిలిచిన ఆ సినిమా తర్వాత హరీష్ కెరీర్ పై ప్రశ్నలు తలెత్తాయి. సాధారణంగా ఇలాంటి సమయంలో హీరోలు దర్శకుల సెలెక్షన్ విషయంలో జాగ్రత్త పడుతుంటారు. ఫ్లాప్ ట్రాక్ లో ఉన్న దర్శకులకు సినిమా చేసే ఛాన్స్ ఇవ్వడంలో కొంత వరకు ఆలోచిస్తారు. కానీ బాలయ్య మాత్రం వేరు. కథ నచ్చితే దర్శకుడి గత రిజల్ట్స్ ను పెద్దగా పట్టించుకోరని తెలిసిందే.టాలెంట్ ను నమ్మి అవకాశాలు ఇవ్వడం బాలయ్య స్టైల్. ఆ కారణంతోనే ఇప్పుడు హరీష్ శంకర్ కు ఛాన్స్ దక్కినట్లు తెలుస్తోంది. మరో విషయమేమిటంటే ఇప్పుడు హరీష్ శంకర్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీతో బిజీగా ఉన్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో చేస్తున్న ఆ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మంచి హిట్ గా నిలిస్తే హరీష్ కు మళ్లీ మాస్ డైరెక్టర్ గా స్ట్రాంగ్ రీఎంట్రీ దక్కే అవకాశం ఉంది. అప్పుడు బాలయ్య ప్రాజెక్ట్ కూ మరింత బూస్ట్ వచ్చే ఛాన్స్ ఉంది. మార్కెట్, బిజినెస్ పరంగా కూడా హైప్ పెరుగుతుందనే చెప్పాలి. ఏదేమైనా బాలయ్య- హరీష్ శంకర్ కాంబో నిజమైతే మాస్ ప్రేక్షకులకు పండగే. పవర్ ఫుల్ డైలాగులు, యాక్షన్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ తో పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ మూవీ రూపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అఫీషియల్ అనౌన్స్మెంట్ కోసం అభిమానులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.